క్లుప్తంగా

సమష్టి కృషితో తలకోన బ్రహ్మోత్సవాల నిర్వహణ

ఎర్రావారిపాళెం: అన్ని శాఖల సమష్టి కృషితో తలకోన శ్రీ సిద్దేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిద్దామని ఈవో జయ కుమార్ తెలిపారు. ఆయన బుధవారం తలకోనలో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యూలు, భక్తులకు తాగునీరు, అన్నదానం, ప్రత్యేక దర్శనం, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లపై అంశాలపై చర్చించారు. తహసీల్దార్ దస్తగిరయ్య, వివిధ శాఖ అధికారులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

'ఆర్‌టీ' అవగాహన సంస్థ కార్యదర్శిగా వెంకటాచలం



చంద్రగిరి: సమాచార హక్కు చట్టం అవగాహన సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ముంగళిపట్టుకు చెందిన వెంకటాచలంను నియమించినట్లు ఆ సంస్థ జాతీయ వ్యవస్థాప అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెంకటాచలం మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. తనకు ఈ పదవిని ఇచ్చిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు అన్నదానం



రుయా వద్ద అన్నదానం చేస్తున్న సరస్వతి

తిరుపతి కల్చరల్: నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ఉప కార్యదర్శి, వినియోగదారుల హక్కుల కమిటీ జాతీయ పీఆర్వో టి.సరస్వతి (శైలజ) జన్మదినం సందర్భంగా బుధవారం రుయా హాస్పిటల్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఇందులో జోష్ ప్రొప్రైటర్ డాక్టర్ ఈశ్వర ప్రకాష్, సబ్ ఇన్స్పెక్టర్ సుమతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

రాయలసీమ రంగస్థలి కార్యాలయం వద్ద బుధవారం మహానటుడు ఎన్‌టీ.రామరావు వర్ధంతిని పురస్కరించుకొని పేదలకు అన్నదానం చేశారు. అంతకుముందు వారు ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, రంగస్థలి నటులు ఎన్‌వీ.రామకృష్ణ, టి.సుబ్రమణ్యం, ఎ.రాజశేఖర్, కె.కేశవులురెడ్డి పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి అగ్రతాంబూలం

- రూ.37.61 కోట్ల పనులకు గ్రీన్ సిగ్నల్
- 25 ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- తిరుపతి అభివృద్ధే మా లక్ష్యం : మేయర్ శిరీష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, హాజరైన డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, భూమన అభినయ్‌రెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు

తిరుపతి తుడా : తిరుపతి నగర అభివృద్ధి, కనెక్టవిటీతోపాటు మరో మూడువేల ఎకరాల్లో విస్తరణ చెందడమే ధ్యేయంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ అగ్రస్థానం ఇచ్చింది. మొత్తం 14 మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డివైడర్లు, మురుగు కాలువలు, గ్రీనరీ తదితరాలకు రూ.37.61 కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపింది. అలాగే మరో 25 అంశాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం బుధవారం మేయర్ ఆర్.శిరీష అధ్యక్షతన ఎస్వీయూ సెనేట్ హాల్‌లో నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్‌రెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గొప్ప విజన్‌తో చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్లు నగర భవిష్యత్‌ను నిర్ణయిస్తాయన్నారు. నగరానికి సరైన కనెక్టివిటీ లేకపోవడంతోనే తూర్పు ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మరో ఐదేళ్లలో తిరుపతి బాగా విస్తరించడంతోపాటు అభివృద్ధి సాధిస్తుందన్నారు. నగర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 24న మున్సిపల్ కార్పొరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామన్నారు. మేయర్ శిరీష మాట్లాడుతూ తమ ప్రతిపాదనల్లో 90 శాతం అభివృద్ధికి సంబంధించినవేనన్నారు. తిరుపతి అభివృద్ధే తమ ధ్యేయమన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లతో నగరం అభివృద్ధిబాట పడుతుందన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతికి ఏళ్ల తరబడి సరైన కనెక్టివిటీ లేకపోవడం బాధాకరమన్నారు. అందుకే రోడ్లకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు అందుబాటులోకి వస్తే నగరం మరింత విస్తరిస్తుందని పేర్కొన్నారు. కోర్టు రోడ్డు విస్తరణ, సంగీత కళాశాల వద్ద ఫ్రీ లెఫ్ట్ నిర్మాణానికి రూ.73 లక్షలు ఆమోదం లభించిందన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్, నీటి వసతుల కల్పనకు నిధులు కేటాయించామన్నారు. పలు ప్రాంతాల్లో మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన అద్దె గదుల ధరలు ఖరారు చేస్తూ కౌన్సిల్ తీర్మానం చేసిందన్నారు.

జీవశాస్త్ర పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం పెరగాలి

తిరుచానూరు : జీవశాస్త్ర పరిశోధనల్లో సాంకేతిక పరిజ్ఞానం మరింత పెరగాలని ఎస్వీయూ రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్ అన్నారు. ఎస్వీయూ జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం నుంచి రెండు వారాల పునశ్చరణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ బయాలజీ ఇన్ 21 సెంచరీ ఆస్పెక్ట్స్ - ప్రాస్పెక్ట్స్ అన్న అంశంపై 15 నిర్వహించనున్న తరగతులను అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీవశాస్త్ర ప్రాముఖ్యతను, అందులో నానోటెక్నాలజీ పోషిస్తున్న పాత్రను వివరించారు. కోర్సు డైరెక్టర్ సి.మోహనాచారి మాట్లాడుతూ సైన్స్ అకాడమీ, ఐఎస్‌సీఏ, ఎన్‌ఎస్‌ఐ వంటి సంస్థలు చేస్తున్న కృషిని వివరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జీవ, రసాయన, భౌతికశాస్త్రాల సమ్మేళనంతో సరికొత్త ప్రయోగాల ద్వారా వ్యాధి నిర్ధారణ పరిజ్ఞానాన్ని ఆధునికంగా సిద్ధం చేస్తున్నారని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి కన్వీనర్‌గా నాగలక్ష్మీదేవమ్మ వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో బాటనీ శాఖాధిపతి ప్రొఫెసర్ సావిత్రమ్మ, ప్రొఫెసర్ శ్రీరామమూర్తి, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూమన కుటుంబానికి రుణపడి ఉంటాం



ఎమ్మెల్యే భూమనను సత్కరిస్తున్న జగనన్న సచివాలయ కన్వీనర్, గృహసారథుల ఇన్‌చార్జ్‌లు

తిరుపతి మంగళం : తమను జగనన్న సచివాలయ కన్వీనర్, గృహసారథుల(జేసీఎస్) ఇన్‌చార్జ్‌లుగా నియమించిన ఎమ్మెల్యే భూమన కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటామని తిరుపతి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్, దొడ్డారెడ్డి మురళీరెడ్డి, ఉదయగిరి రమేష్ తెలిపారు. వారు బుధవారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని వారి స్వగృహంలో కలిసి సత్కరించారు. ప్రజలకు జగనన్న సంక్షేమ పథకాలు అందించడంతోపాటు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఘనంగా వసంతోత్సవం



ఊరేగింపుగా వస్తున్న మూలస్థాన ఎల్లమ్మ, ధర్మరాజుల స్వామి

చంద్రగిరి: మూలస్థాన ఎల్లమ్మ సంక్రాంతి సంబరాల్లో భాగంగా చివరి రోజైన మంగళవారం కొండచుట్టును ముగించుకుని బుధవారం మధ్యాహ్నం అమ్మవారు, ధర్మరాజుల వారితో కలిసి ఆలయానికి చేరుకున్నారు. అగరాల, ఐతేపల్లి, పుల్లిత్తివారిపల్లి, కొటాల, రామిరెడ్డిపల్లి, రెడ్డివారిపల్లి మీదుగా అమ్మవారు ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు అమ్మవారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. వసంతోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. రాత్రి అమ్మవారు అశ్వ వాహనంపై ఆశీనులై ఆలయం నుంచి ఊరేగింపుగా కొత్తపేటలోని బ్రహ్మంగారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ తోటోత్సవాన్ని నిర్వహించి ఉత్సవాలను ముగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈవో రామకృష్ణారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

12 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 12 మందికి రూ.20,810లు జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు. నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

పశువైద్య శిబిరానికి స్పందన

రామచంద్రాపురం: రాయలచెరువుపేటలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పశువులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. వెటర్నరీ కళాశాల ప్రొఫెసర్లు వాణి, నాగేందర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, కుప్పంబాదూరు పశువైద్యాధికారి హేమకుమార్, ఎన్‌ఎస్‌ఎస్ సిబ్బంది వరప్రసాద్‌రెడ్డి, నవీన్, రంగమ్మ, అనూష పాల్గొన్నారు.

ప్రజలకు రూ.3 లక్షల కోట్ల లబ్ధి



జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి

- ప్రతి గడపకూ రూ.9 లక్షల నుంచి రూ.12 లక్షలు అందిన వైనం
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



గోపూజ చేస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడన్నరేళ్లల్లో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.3 లక్షల కోట్లను లబ్ధి చేకూర్చారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. ఆయన బుధవారం మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ మునిరామిరెడ్డితో కలిసి 8వ డివిజన్‌లోని సుభాష్‌నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గడప గడపకూ వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికి తమకు అందిన పథకాలతో సంతోషంగా ఉన్నామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ రూ. 9 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు లబ్ధి కలిగిందని తెలిపారు. గతంలో ఇంతగా ఏ నాయకుడైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఇన్ని సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న జగనన్నకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

యుగానికి ఒక్కడే

పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లాంటి నాయకుడు యుగానికి ఒక్కడే అవతరిస్తాడని తిరుపతి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డితో కలిసి 1వ డివిజన్ తిమ్మినాయుడుపాళెంలోని యాదవకాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉన్నప్పటికీ అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక నాయకుడు జగనన్న అని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి జగనన్నను గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పందలూరు పెంచులయ్య, పాముల రమేష్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ వాసుయాదవ్, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, బోకం అనీల్, డైరెక్టర్లు కడపగుంట అమరనాథ్‌రెడ్డి, పోలిరెడ్డి నాగిరెడ్డి, కాసీమ్, బ్రహ్మానందరెడ్డి, అనీల్‌రాయల్, నైనారు శ్రీనివాసులు, మురళి, రవిచంద్ర, గఫూర్, తాలూరి ప్రసాద్, చందురాయల్, నాదముని, కంకనాల రమేష్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ రజని, మాజీ రిజిస్ట్రార్ డీఎం మమత

తిరుచానూరు: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడైన నందమూరి తారక రామారావుకు యూనివర్సిటీలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజని మాట్లాడుతూ మహిళల విద్య ప్రాముఖ్యతను గుర్తించి యూనివర్సిటీని ఏర్పాటుచేసి ఎంతోమందికి ఉపాధి కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు. మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డీఎం మమత మాట్లాడుతూ యూనివర్సిటీ దినదినాభివృద్ధి చెందినప్పుడే ఎన్టీఆర్ కల సాకారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ గీతావాణి, ఇంజినీర్ శ్రీనివాసులు, ప్రొఫెసర్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.